హోరాహోరీగా క్రీడా పోటీలు

దెందులూరు: ఆడుదాం- ఆంధ్రలో భాగంగా గ్రామగ్రామాన క్రీడా పోటీలు ఉత్సాహంగా నిర్వహిస్తున్నారు. మండల విద్యాశాఖాధికారులు ఏవీఎస్‌వీ ప్రసాద్, అన్నమ్మ, అన్ని పాఠశాలల ఫిజికల్ డైరెక్టర్లు, పీఈటీలు, గ్రామ కార్యదర్శుల ఆధ్వర్యంలో పోటీలు నిర్వహించారు. కొత్తగూడెం సచివాలయంలో సర్పంచ్ పరసా లక్ష్మీ సుజాత కబడ్డీ, క్రికెట్ పోటీలను ప్రారంభించారు. సచివాలయం ఏ, బీ జట్లు తలపడ్డాయి. ఎంఈఓ ప్రసాద్ క్రీడాకారులను పరిచయం చేసుకుని శుభాకాంక్షలు తెలిపారు.

కొవ్వలి గ్రామంలో ఆడుదాం ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా షటిల్ పోటీలు ఫిజికల్ డైరెక్టర్, మండల కన్వీనర్ జక్కుల సురేష్, గ్రామ కార్యదర్శి ఆధ్వర్యంలో నిర్వహించారు. సచివాలయం-1, 2 జట్ల మధ్య నిర్వహించిన పోటీల్లో సచివాలయం-2 విజయం సాధించింది. కొవ్వలి-2 బ్యాడ్మింటన్ గేమ్‌లో బీ.సతీష్, జీ. విజయ్ టీమ్‌పై ఏ. సుధాకర్, జీ.కృష్ణ టీమ్ గెలుపొందింది. విజేతలను హెచ్‌ఎం శర్మ, మండల కన్వీనర్ జక్కుల సురేష్, ఉపాధ్యాయులు అభినందించారు.



దెందులూరు : విద్యార్థులను పరిచయం చేసుకుంటున్న ఎవీఎస్‌వీ ప్రసాద్

యువతలో జోష్ నింపుతున్న ఆడుదాం ఆంధ్ర

భీమడోలు: ఆడుదాం ఆంధ్ర కార్యక్రమం క్రీడాకారుల్లో నూతనోత్సాహాన్ని నింపుతోంది. నాల్గవ రోజైన శుక్రవారం భీమడోలు, పూళ్ల, గుండుగొలను, ఆగడాలలంకలోని జెడ్పీ హైస్కూల్ క్రీడా ప్రాంగణాల్లో నిర్వహించిన బ్యాడ్మింటన్ డబుల్స్ పోటీల్లో 53 టీములు పాల్గొని తమ క్రీడా ప్రతిభను చాటారు. యువతలో శారీరక, మానసిక ఆరోగ్యాన్ని పెంపొందించేందుకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టింది. దీనిలో భాగంగా భీమడోలులో 13, గుండుగొలను 18, పూళ్ల 19, ఆగడాలలంక 3 టీములు పాల్గొని తమ సత్తా చాటారు. యువత ఈ పోటీల్లో పాల్గొని తమలో దాగి ఉన్న నైపుణ్యాలను ప్రదర్శించి ఔరా అనిపించారు. సంబంధిత అధికారులు ఎంపీడీవో సీహెచ్ పద్మావతిదేవి, ఎం.ఇందిరాగాంధీ, ఏ.సుందరి, కె.రామారావుల పర్యవేక్షణలో ఉత్తమ క్రీడాకారులు ఎంపిక చేసి మండల స్థాయి పోటీలకు పంపనున్నామని వారు పేర్కొన్నారు.

పోటాపోటీగా ఆడుదాం ఆంధ్ర

పెదవేగి : రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆడుదాం ఆంధ్రాలో యువత వివిధ రకాల క్రీడల్లో ఉత్సాహంగా పోటీపడుతున్నారని పెదవేగి ఎంపీపీ తాతా రమ్య అన్నారు. శుక్రవారం పెదవేగిలో నాలుగో రోజు కార్యక్రమంలో ఖోఖో పోటీలను ఎంపీపీ ప్రారంభించారు. కబడ్డీ, క్రికెట్, షటిల్, ఖోఖో బాల బాలికలు పోటీపడ్డారు. అనంతరం పినకడిమిలో సమీప గ్రామ క్రీడాకారులు క్రీడాపోటీల్లో ప్రతిభ కనబరిచారు. ఈ కార్యక్రమంలో క్రీడాకారులు, స్థానిక నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు పాల్గొన్నారు.



దెందులూరు : కబడ్డీ పోటీల్లో తలపడుతున్న కొత్తగూడెం క్రీడాకారులు



పెదవేగి : ఖోఖో పోటీలో ఉత్సాహంగా పాల్గొన్న బాలురు



భీమడోలు : గుండుగొలనులో హోరాహోరీగా సాగిన షటిల్ పోటీలు

క్లుప్తంగా

బాదంపూడి కాంప్లెక్స్‌లో టీఎల్‌ఎం ప్రదర్శన



టీఎల్‌ఎం ప్రదర్శనలో పాల్గొన్న ఉపాధ్యాయులు

ఉంగుటూరు: ఉంగుటూరు మండలం బాదంపూడి కాంప్లెక్స్‌లో టీఎల్‌ఎం ప్రదర్శన కాంప్లెక్స్ చైర్మన్ ఎమ్.వి.భాస్కరరావు, సెక్రటరీ శింగవరపు శ్రీనివాస్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. పరిశీలకులుగా ఉంగుటూరు మండల విద్యాశాఖాధికారి-2 కె.శ్రీనివాసరావు ఉపాధ్యాయులు తయారు చేసిన టీఎల్ఎంను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ కాంప్లెక్స్‌లలో నేర్చుకున్న విషయాలు తరగతి గదిలో ఉపయోగించాలన్నారు. ఈ ట్రైనింగ్ ఉపాధ్యాయులకు బోధనలో ఉపయోగపడతాయన్నారు. రిసోర్స్ పర్సన్లుగా అల్లు శ్రీనివాసరావు, కొరపాటి హరికృష్ణ, శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాద బాధితులకు సాయం అందజేత



అగ్ని ప్రమాద బాధితులకు సాయం అందజేస్తున్న ఎంపీపీ గంటా శ్రీలక్ష్మి

ఉంగుటూరు: ఉంగుటూరులో అగ్ని ప్రమాద బాధితులకు ఎంపీపీ గంటా శ్రీలక్ష్మి తన సొంత సొమ్ము ఇర్లపాటి వెంకటలక్ష్మికి రూ.3వేలు, కారెం సుబ్బమ్మకు రూ.వెయ్యి ఆర్థిక సాయం అందజేశారు. శ్రీలక్ష్మితో పాటుగా వైఎస్సార్ సీపీ నాయకుడు గంటా సుబ్బారావు, జిల్లా కార్యవర్గ సభ్యురాలు మంద జయలక్ష్మి పాల్గొన్నారు. ఉంగుటూరు మండల మానవత సంస్థ తరుపున రూ.10 వేలు బాధితులకు సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గంటా శ్రీలక్ష్మి, మానవత జిల్లా నాయకుడు సాగిరాజు జానకి రామరాజు, రీజియన్ చైర్మన్ పుప్పాల గోపి, మండల శాఖ అధ్యక్షుడు గంజి రవి, ఏఎంసీ మాజీ చైర్మన్ కొండ్రెడ్డి సర్వేశ్వరరావు మానవత సభ్యులు పాల్గొన్నారు. మానవత సభ్యులను ఎంపీపీ అభినందించారు.

దుర్గాదేవికి ప్రత్యేక పూజలు



బువ్వనపల్లిలో ప్రత్యేక అలంకరణలో దుర్గాదేవి అమ్మవారు

నిడమర్రు: నిడమర్రు మండలం బువ్వనపల్లి గాంధీనగర్‌లోని శ్రీచక్రధారిణి కనకదుర్గ అమ్మవారిని శుక్రవారం భవానీ భక్తులు ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. ఉదయం అమ్మవారి ఆలయం వద్ద భజనలు చేశారు. భవానీ మాలధారులు ఆలయంవద్ద అమ్మవారికి ప్రత్యేకపూజలు చేశారు. పెద్దసంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు.


యూటీఎఫ్ క్యాలెండర్, డైరీ ఆవిష్కరణ



యూటీఎఫ్ క్యాలెండర్, డైరీని ఆవిష్కరిస్తున్న దృశ్యం

ఉంగుటూరు: ఉంగుటూరు మండల విద్యాశాఖాధికారి-2 కె.శ్రీనివాసరావు శుక్రవారం యూటీఎఫ్ క్యాలెండర్, డైరీ ఆవిష్కరించారు. యూటీఎఫ్ అధ్యక్షుడు వునుముల రాంబాబు, ప్రధాన కార్యదర్శి డాకి జోగినాయుడు అధ్యక్షతన కార్యక్రమాన్ని నిర్వహించారు. యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి సి.హెచ్. శ్రీధర్ మాట్లాడుతూ యూటీఎఫ్ డైరీలో ఉపాధ్యాయులకు ఉపయోగపడే ఎంతో సమాచారం, జీవోల వివరాలు లభ్యమవుతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కౌన్సిలర్ పుప్పాల నరసింహారావు, ఉపాధ్యక్షుడు హరికృష్ణ, కోశాధికారి ఓ.ఆనంద్ కుమార్, ప్రేమ్ కుమార్, లక్ష్మీనారాయణ, వర్మ, కె.రాణి పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శిగా బాలస్వామి నియామకం



రాచూరి బాలస్వామి

పెదవేగి : ముండూరుకి చెందిన వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు రాచూరి బాలస్వామిని పార్టీ ఏలూరు జిల్లా కార్యదర్శిగా నియమిస్తూ పార్టీ అధిష్టానం నుంచి వచ్చిన నియామకం పత్రాలను ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా బాలస్వామి మాట్లాడుతూ తనను పదవికి ఎంపిక చేసిన సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి, ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరికి, ఏపీ ఆయిల్ ఫెడ్ మాజీ రైతు కమిటీ చైర్మన్ కొఠారు రామచంద్రరావు, మండల పార్టీ అధ్యక్షుడు జానంపేట బాబుకు, పార్టీ నాయకులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు వజ్రాయుధం



అంకన్నగూడెంలో ఓటు హక్కు ప్రాధాన్యతను వివరిస్తున్న ఎంపీడీఓ జీఆర్ మనోజ్

పెదవేగి : ప్రజాస్వామ్యంలో ఓటుహక్కు వజ్రాయుధంతో సమానమని, సామాన్యుని చేతుల్లో బలమైన ఆయుధమని, దీనిని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని పెదవేగి మండలం ఎంపీడీవో జీఆర్ మనోజ్ అన్నారు. ఓటు హక్కు అర్హత ఉన్నవారు, ఓటరు జాబితాలో మార్పు చేర్పుల కోసం వచ్చే నెల 5 వరకు అవకాశం ఉన్నందున స్థానిక బీఎల్వోలను సంప్రదించాలని మండల పరిషత్ అభివృద్ధి అధికారి, అదనపు ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్ మనోజ్ తెలియజేశారు. పెదవేగి మండలం అంకన్న గూడెం, బి సింగవరంలో నిర్వహించిన వికసిత్ భారత్ సంకల్ప్ యాత్రలో ఎంపీడీవో పాల్గొని ఓటు హక్కు ఆవశ్యకతను గ్రామస్తులకు వివరించారు.

వైఎస్సార్ సీపీ విజయానికి కృషి

ఉంగుటూరు: యువజన విభాగం మండల అధ్యక్షుడిగా నియమించినందుకు ఎమ్మెల్యే వాసుబాబుకు ఆకల రాజు కృతజ్ఞతలు తెలిపారు. రాబోయే ఎన్నికలలో వైఎస్సార్ సీపీ విజయఢంకా మోగించేందుకు కృషి చేస్తానని తెలిపారు. మండలంలో అన్ని గ్రామాల్లో యువజన విభాగంలో యువతను చైతన్యపరిచే కార్యక్రమాలు నిర్వహిస్తానని యువజన విభాగం మండల అధ్యక్షుడు ఆకులరాజ తెలిపారు.

ఎంపీ నిధులతో కల్వర్టు నిర్మాణం

దెందులూరు: జిల్లాలోని ఏజెన్సీ జంగారెడ్డిగూడెం, కేతవరం గ్రామ శివారు శోభానాద్రిపురంలో ఎంపీ నిధుల నుంచి రూ.10 లక్షలు మంజూరు చేసినట్టు ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్ తెలిపారు. శుక్రవారం ఎంపీ కార్యాలయంలో ఆయన ఓ ప్రకటనలో వివరాలను వెల్లడించారు. వర్షాకాలంలో రైతులు ఆ మార్గం నుంచి తమ పొలాలకు వెళ్లాలంటే ప్రత్యక్ష నరకం చూసేవారన్నారు. రైతులంతా కలిసి కల్వర్టు నిర్మాణ అవసరాన్ని వివరించడంతో వెంటనే నిధులు మంజూరు చేసినట్టు పేర్కొన్నారు. ప్రజాప్రతినిధులు, రైతులు కల్వర్టు నిర్మాణాన్ని ప్రారంభించారన్నారు. దాదాపు 2 వేల ఎకరాలకు చెందిన రైతుల కల 30 ఏళ్ల తరువాత ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్ రూపంలో తీరిందని వైస్ ఎంపీపీ నరెడ్ల బుజ్జిబాబు, సర్పంచ్ వరదా వెంకట సత్యనారాయణ, వైస్ ప్రెసిడెంట్ కవులూరి శివ, రైతు ప్రముఖులు, రైతులు అన్నారు. ఏలూరు ఎంపీ మేలును తాము ఎన్నటికీ మరువలేమని అన్నారు. సచివాలయ కన్వీనర్ ఎలికే పవన్, సోషల్ మీడియా కో కన్వీనర్ రవి, వైఎస్సార్ సీపీ పెద్దలు, రైతులు ఎంపీ శ్రీధర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.



శోభనాద్రిపురంలో కల్వర్టు నిర్మిస్తున్న దృశ్యం

నేడు అడవికొలను సచివాలయం-2 భవనం ప్రారంభం

నిడమర్రు: ఎనికేపల్లిలో రూ.43 లక్షల అంచనా వ్యయంతో నిర్మించిన అడవికొలను గ్రామ సచివాలయం-2 నూతన భవనాన్ని శనివారం ఉదయం 9 గంటలకు ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు ప్రారంభిస్తారని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ సంకు సత్యకుమార్ తెలిపారు. అనంతరం ఎన్ఆర్‌జీఎస్ నిధులు రూ. 5లక్షలతో నిర్మించిన అంతర్గత సిమెంట్ రోడ్డును ప్రారంభిస్తారన్నారు. ఈ కార్యక్రమానికి వైఎస్సార్ సీపీ శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గోవాలని కోరారు.


విద్యా సామర్థ్యాలను మెరుగుపర్చాలి

భీమడోలు: ఉపాధ్యాయులు విద్యాబోధనపై అలసత్వం వద్దని భీమడోలు ఎంఈవో 1 ఈదుపల్లి శ్రీనివాసరావు, ఎంఈవో 2 అయినపర్తి భాస్కర్‌కుమార్ అన్నారు. భీమడోలు ఉన్నత పాఠశాలలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న స్కూలు కాంప్లెక్స్ సమావేశాలు శుక్రవారం ముగిసాయి. నిర్దేశించిన విద్యా కార్యక్రమాలపై శిక్షణ అందించారు. పాఠ్యాంశ ప్రణాళిక, అంగన్‌వాడీల నిర్వహణ, కథలు చెప్పడం, పాఠశాల్లో నిర్వహిస్తున్న విద్యా కార్యక్రమాలు వాటి ప్రగతిపై అవగాహన కల్పించారు. పాఠశాలలో నిర్వహించాల్సిన విద్యా కార్యక్రమాల పట్ల వారికి దిశానిర్దేశం చేసారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో విద్యాబోధన చేసి వారి ప్రగతికి దోహదపడాలని, విద్యాబుద్ధులు అందించడంతో ఎటువంటి అశ్రద్ధ వహించవద్దన్నారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలన్నారు. ఉపాధ్యాయులు నిత్య విద్యార్థులే అన్నారు. విద్యా సామర్థ్యాలను మెరుగుపర్చాలన్నారు. బేస్‌లైన్ పరీక్షలో వెనుకబడిన విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. చిన్నారులతో ఎక్కువగా బాహ్యపఠనం చేయించాలని, చూచిరాత, ఉక్తలేఖనం నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎంలు పాశం పాండురంగారావు, జి.బాలభాస్కర్, బుల్లిదొర, రామరాణి, బాలిన సత్యనారాయణ, టీచర్లు మండే సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.



స్కూల్ కాంప్లెక్స్ సమావేశంలో టీచర్లతో మాట్లాడుతున్న ఎంఈవో-1 శ్రీనివాసరావు

రామావతారంలో జనార్ధన స్వామి దర్శనం



రామావతారంలో జనార్ధన స్వామి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ధనుర్మాసోత్సవాల్లో భాగంగా స్థానిక అగ్రహారంలోని శ్రీ భూ, నీళా సమేత శ్రీ జనార్ధన స్వామి శ్రీరామావతార అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. స్వామి వారికి శుక్రవారం ఉదయం సుప్రభాత సేవ, తిరుప్పావై సేవా కాలం నిర్వహించారు. భక్తుల గోత్రనామాలతో అష్టోత్తర పూజలు చేశారు. రాత్రి స్వామి వారికి ప్రత్యేక పూజలు చేసి నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి తీర్థ ప్రసాద వితరణ చేశారు. అర్చకులు వంగల పవన్ కుమార్ విశేష పూజలు చేయగా, కార్యనిర్వహణాధికారి గుబ్బల రామ పెద్దింట్ల రావు కార్యక్రమాలను పర్యవేక్షించారు.

దివ్యాంగుల హక్కులపై అవగాహన సదస్సు

పెదపాడు: దివ్యాంగుల పట్ల గౌరవ భావంతో మెలగాలని పెదపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యులు అనంతపాల్ తెలిపారు. మండలంలోని పీహెచ్‌సీ వద్ద ఉమా ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో వైద్యులు అనంతపాల్ మాట్లాడారు. 2016 దివ్యాంగుల చట్టం ప్రకారం దివ్యాంగులు 21 రకాలుగా గుర్తించామన్నారు. ఈ సందర్భంగా దివ్యాంగుల హక్కులను వివరించారు. జిల్లా దివ్యాంగుల పునరావాస కేంద్రంలో నిర్వహించే కార్యక్రమాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా దివ్యాంగుల పునరావాస కేంద్రం కో ఆర్డినేటర్ శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ దివ్యాంగుల పునరావాస కేంద్రం ద్వారా దివ్యాంగులకు కృత్రిమ అవయవాలు, ఫిజియోథెరపీ, స్పీచ్ థెరపీ అందించడంతో పాటు కేంద్రంలో యూఐడీ సేవలు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.



పెదపాడు పీహెచ్‌సీ వద్ద అవగాహన సదస్సులో మాట్లాడుతున్న మెడికల్ ఆఫీసర్ చక్రధర్

నేడు ఎస్సీ కమిషన్ చైర్మన్ విక్టర్ ప్రసాద్ రాక

పెదవేగి : రాష్ట్ర షెడ్యూల్డ్ కులాల కమిషన్ చైర్మన్ మారుమూడి విక్టర్ ప్రసాద్ ఈనెల 30న శనివారం పెదవేగి మండలం వేగివాడలో పర్యటించనున్నారు. శనివారం ఉదయం 11.30 గంటలకు వేగివాడ చేరుకొని సెయింట్ జోసెఫ్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలను సందర్శించి, ఇటీవల తెలుగు ఉపాధ్యాయుడు కొత్తపల్లి రత్తయ్య ఆత్మహత్యకు దారితీసిన ఘటనపై ఆయన విచారణ చేపడతారు.

జగనన్న స్మార్ట్ టౌన్‌షిప్‌లో మౌలిక సదుపాయాలు

- ఇడా కార్యాలయంలో ప్లాట్ల ఎంపికకు లాటరీ
- ఇడా చైర్మన్ బొద్దాని శ్రీనివాస్

ఏలూరు టౌన్: ఏలూరులోని జగనన్న స్మార్ట్ టౌన్‌షిప్‌లో అన్ని సౌకర్యాలూ కల్పిస్తూ తక్కువ ధరకే అందిస్తూ మధ్యతరగతి వర్గాలకు లబ్ధి చేకూరేలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చర్యలు చేపట్టారని ఏలూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్ బొద్దాని శ్రీనివాస్ అన్నారు. ఏలూరు ఖండ్రికగూడెం ప్రాంతంలోని ఇడా కార్యాలయంలో శుక్రవారం ఆయన జగనన్న స్మార్ట్ టౌన్‌షిప్‌లో ప్లాట్ల ఎంపికకు సంబంధించి డ్రా తీశారు. ఇప్పటికే నాలుగు దశల్లో ప్లాట్ల ఎంపికకు లాటరీ తీయగా నాలుగోసారి ఆరుగురికి స్థలాన్ని కేటాయిస్తూ రిజిస్ట్రేషన్ పత్రాలను అందజేశారు. మూడు దశల్లో 74 మందికి ప్లాట్లను కేటాయించామని ఇడా చైర్మన్ బొద్దాని శ్రీనివాస్ తెలిపారు. ఏలూరు ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు ఆళ్ల నాని ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏలూరులో ఎంఐజీ లేఅవుట్‌ను 36 ఎకరాల్లో ఏర్పాటు చేసిందని వివరించారు. మధ్యతరగతి వర్గాలు, ఉద్యోగస్తులకు అన్ని సౌకర్యాలతో ఇళ్ల స్థలాలు అందజేయాలనే ఉద్దేశంతో జగనన్న స్మార్ట్ టౌన్‌షిప్‌ను ఏర్పాటు చేశామని తెలిపారు.



లాటరీ ద్వారా ఎంపిక చేసి ప్లాట్ పత్రాన్ని లబ్ధిదారుడికి అందజేస్తున్న ఇడా చైర్మన్ బొద్దాని శ్రీనివాస్

ఏపీ ఎన్‌జీవోల క్యాలెండర్ ఆవిష్కరణ

ఏలూరు(మెట్రో): ఏపీ ఎన్జీవోల ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా అసోసియేషన్ 2024 క్యాలెండర్‌ను ఏలూరు జిల్లా కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ ఆవిష్కరించారు. స్థానిక కలెక్టరేట్‌లో శుక్రవారం కలెక్టర్ ప్రసన్నవెంకటేష్‌ను ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ఏపీ ఎన్జీవో సంఘం అధ్యక్షుడు చోడగిరి శ్రీనివాస్ కార్యదర్శి నెరుసు రామారావు, ఏలూరు తాలూకా అధ్యక్షుడు గోన్నూరి శ్రీధర్ రాజు, కార్యదర్శి కె.సత్యనారాయణ, జిల్లా సంఘ నాయకులు, మహిళా విభాగం చైర్‌పర్సన్ కె.నాగమణి, మహిళా విభాగం సభ్యులు మర్యాదపూర్వకంగా కలిసి పూలమొక్కలు అందజేశారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా, ఏలూరు తాలూకా 2024 వార్షిక క్యాలెండర్‌ను కలెక్టర్ ఆవిష్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

'కంటి వెలుగు' పేద విద్యార్థులకు వరం

భీమడోలు: జగనన్న ఆరోగ్య సురక్ష కంటి వెలుగు పథకం పేద విద్యార్థుల పాలిట వరమని భీమడోలు హైస్కూలు ఇన్‌చార్జి హెచ్‌ఎం ఎస్ఎస్ అహ్మద్ అన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా భీమడోలు ఉన్నత పాఠశాలకు చెందిన 52 మంది విద్యార్థినీ విద్యార్థులకు కంటి అద్దాలు అవసరమని గుర్తించారు. శుక్రవారం పాఠశాలలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో వారికి కళ్లజోళ్లను ఉచితంగా అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కంటి సమస్యలను సరైన సమయంలో గుర్తించకపోవడం వల్ల చిన్నారులు చదువులో వెనుకబడుతున్నారన్నారు. కంటి సమస్యలు ప్రాథమిక స్థాయిలో గుర్తించడం వల్ల పరిష్కారమవుతాయన్నారు. పేద విద్యార్థులు చదువుకునే పాఠశాలల్లో ప్రభుత్వం ఆదేశాల మేరకు కంటి పరీక్షలు నిర్వహించడం వల్ల కళ్ల సమస్యలు ఉన్న వారిని కనుగొని వారికి కళ్ల జోళ్లు అందించే బృహత్తర కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపట్టడం వారికి వరమన్నారు. ఏఎన్‌ఎంలు కనకరత్నం, మురళీ, ఎంఎల్‌హెచ్‌పీ, ఆశావర్కర్లు పాల్గొన్నారు.



ఉన్నత పాఠశాలలో బాలికలకు కళ్లజోళ్లు అందిస్తున్న ఇన్‌చార్జి హెచ్‌ఎం, వైద్య శాఖ సిబ్బంది

ఉంగుటూరులో వానరాల హల్‌చల్



ఉంగుటూరు వీధుల్లో సంచరిస్తున్న వానరాలు



ఇళ్లలోకి చొరబడి తిరుగుతున్న వానరాలు

ఉంగుటూరు: వానరాలు ఉంగుటూరులో హల్‌చల్ చేస్తున్నాయి. బాహాటంగా వీధుల్లో కోతులు సంచరించడంతో రహదార్లపై నడిచేందుకు ప్రజలు భయపడుతున్నారు. ఒక్కో సారి ఎదురు తిరిగి దాడి చేస్తున్నాయి. ప్రధానంగా మహిళలు, విద్యార్థులు, చిన్న పిల్లలు రాకపోకలకు భయపడుతున్నారు. కొన్ని కోతులు ఇళ్లలోకి చొరబడి తినుబండారాలను పట్టుకుపోతున్నాయి. గ్రామ పంచాయతీలో చెప్పినా అధికారులు స్పందించలేదని స్థానికులు అన్నారు. గ్రామంలో సుమారు 200 కోతులు సంచరిస్తున్నాయి. ఈ విషయంపై గ్రామ పంచాయతీ కార్యదర్శి గిరిధర్‌ను ప్రశ్నించగా కోతులను త్వరలో పట్టుకుని అటవీ ప్రాంతానికి తరలిస్తామని తెలిపారు.

నగరాభివృద్ధికి కృషి చేస్తాం

మేయర్ షేక్ నూర్జహాన్

ఏలూరు టౌన్: నూతన స్టాండింగ్ కమిటీ ఏలూరు నగర అభివృద్ధికి తమ వంతు కృషి చేయాలని ఏలూరు నగర మేయర్ షేక్ నూర్జహాన్ అన్నారు. ఏలూరు నగరపాలక సంస్థ ప్రస్తుత స్టాండింగ్ సభ్యుల పదవీకాలం ఈ నెల 30వ తేదీతో ముగియనుంది. ఈ నేపథ్యంలో నూతనంగా ఐదుగురు స్టాండింగ్ కమిటీ సభ్యులను ఎన్నుకోవాల్సి ఉండటంతో ఈ నెల 11న నూతన కమిటీ ఎన్నికకు నోటిఫికేషన్ జారీ చేశారు. స్టాండింగ్ కమిటీ సభ్యులుగా ఐదుగురు సభ్యులు నామినేషన్ పత్రాలను దాఖలు చేయడంతో వారిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్టు మేయర్ నూర్జహాన్ తెలిపారు.

స్టాండింగ్ కమిటీ సభ్యులు వీరే

నూతన స్టాండింగ్ కమిటీ సభ్యులుగా 11వ డివిజన్ కార్పొరేటర్ కోయా జయగంగ, 17వ డివిజన్ కార్పొరేటర్ పాము పద్మ, 21వ డివిజన్ కార్పొరేటర్ అన్నపనేని భారతి, 31వ డివిజన్ కార్పొరేటర్ పోతర్లంక లక్ష్మణ్, 41వ డివిజన్ కార్పొరేటర్ ఈదుపల్లి కల్యాణిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా మేయర్ నూర్జహాన్ మాట్లాడుతూ ఏలూరు నగరాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు ఏలూరు ఎమ్మెల్యే సారథ్యంలో ప్రణాళికాబద్ధంగా పనిచేస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్లు గుడిదేశి శ్రీనివాసరావు, నూకపెయ్యి సుధీర్‌బాబు, కోఆప్షన్ సభ్యులు ఎస్ఎంఆర్ పెదబాబు, కార్పొరేటర్లు సబ్బన శ్రీనివాసరావు, కలవకొల్లు సాంబ, మాజీ కార్పొరేటర్ బండారు కిరణ్, కార్పొరేషన్ సెక్రటరీ ప్రభుదాస్, సిబ్బంది ఉన్నారు.



స్టాండింగ్ కమిటీ సభ్యులతో మేయర్ నూర్జహాన్, డిప్యూటీ మేయర్ గుడిదేశి శ్రీనివాస్

అపరిచితులతో అప్రమత్తంగా ఉండాలి



సదస్సులో మాట్లాడుతున్న రత్నప్రసాద్

ఏలూరు (ఆర్ఆర్‌పేట): సంఘవ్యతిరేక శక్తులతో అత్యంత అప్రమత్తంగా ఉండాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్ విద్యార్థులను హెచ్చరించారు. రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి పురుషోత్తం కుమార్ ఆధ్వర్యంలో స్థానిక సత్రంపాడులోని ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణా సంస్థలో మాదక ద్రవ్యాల నివారణ, మానవ అక్రమ రవాణా నిరోధం అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రత్నప్రసాద్ మాట్లాడుతూ అపరిచిత వ్యక్తులతో విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని, విద్యార్థులనే ప్రలోభాలకు గురిచేసి మాదకద్రవ్యాల రవాణా చేస్తున్నారని వివరించారు. తెలిసి చేసినా తెలియక చేసినా నేరాలకు చట్టం ప్రకారం శిక్ష తప్పదన్నారు. యువతీ యువకులను ఉద్యోగాల పేరిట మభ్యపెట్టి మానవ అక్రమ రవాణా చేస్తున్నారని హెచ్చరించారు. ఇటువంటి వారి విషయాలను జిల్లా న్యాయ సేవాధికార సంస్థ దృష్టికి తీసుకురావాలన్నారు. అవసరమైతే న్యాయ సాయం ఉచితంగా అందిస్తామని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ప్యానల్ లాయర్లు కూన కృష్ణారావు, సోముల రాములు, కట్టా సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.